

ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన గోల్కొండ క్రాఫ్ట్ టెక్స్‌టైల్స్ మేళాలో కొనుగోలుదారులతో రద్దీగా మారిన వివిధ స్టాళ్లు

నేటితో ముగియనున్న గోల్కొండ క్రాఫ్ట్ టెక్స్‌టైల్స్ మేళా

కవాడిగూడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హస్తకళాభివృద్ధి సంస్థ, నాబార్డ్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ కళాభారతి ఎన్టీఆర్ స్టేడియంలో ఇటీవల ప్రారంభమైన గోల్కొండ క్రాఫ్ట్ టెక్స్‌టైల్స్ మేళాకు సందర్శకులనుంచి విశేష ఆదరణ లభిస్తోంది. దేశంలోని నలుమూలల నుంచి దాదాపు 150 మంది హస్తకళాకారులు తాము రూపొందించిన విభిన్న రకాల ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. తెలంగాణ హస్తకళలు చేనేత వస్త్రాలతో పాటు ఇతర ప్రాంతాల కళాకారులు రూపొందించిన వారి ఉత్పత్తులను వినియోగదారులకు స్వయంగా విక్రయించుకునే అవకాశం ప్రదర్శనలో కల్పించారు. నగర నలు మూలల నుంచే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల నుంచి సైతం వస్తున్న సందర్శకులతో క్రాఫ్ట్ టెక్స్‌టైల్స్ మేళా ప్రతినిత్యం కళకళలాడుతోంది. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ ప్రదర్శన ఆదివారంతో ముగియనుంది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగనుంది. మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగానిలిచే హస్తకళా ఉత్పత్తులను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్న సదాశయంతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రతి ఒక్కరూ సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని, కళాకారులు రూపొందించిన హస్తకళా ఉత్పత్తులను ఆదరించి అందుబాటు ధరలకే విక్రయిస్తున్న వారినుంచి కొనుగోలు చేసి వారికి తోడ్పాడును అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిర్వాహకులు కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న జైసింహ, పక్కన రాకేష్ తదితరులు

బీఆర్ఎస్‌ను బూత్‌స్థాయి నుంచి పటిష్టం చేయాలి

● పార్టీ యువనేత ముఠా జైసింహ

చిక్కడపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీని బూత్‌స్థాయి నుంచి పటిష్టం చేయాలని ఆ పార్టీ యువనేత ముఠా జైసింహ సూచించారు. గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం డివిజన్ పార్టీ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జైసింహ మాట్లాడుతూ ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త, నాయకుడు ప్రతినిత్యం పార్టీ కోసం కొంత సమయం కేటాయించాలని అప్పుడే పార్టీ పటిష్టతతోపాటు ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గాంధీనగర్ డివిజన్‌లో విజయం సాధించేందుకు ఇప్పట్నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ నేతలు పోతుల శ్రీకాంత్, ముఠా నరేష్, డివిజన్ పార్టీ పరిశీలకులు కొండపల్లి మాధవ్, ఆకుల శ్రీనివాస్, పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ముఠా జైసింహ మాట్లాడుతూ కార్యకర్తల కృషి వల్ల ముషీరాబాద్‌లో బీఆర్ఎస్ బలమైన శక్తిగా మారిందని అన్నారు.

ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం శనివారం భరత్‌నగర్‌లో జరిగింది. డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాస్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.

కులసర్వే ఫలితమే బీసీ బిల్లులు: ప్రొ. సింహాద్రి



చిక్కడపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రెండు బీసీ బిల్లులను తెలంగాణ క్యాబినెట్ ఆమోదించడాన్ని సమాజ్‌వాది పార్టీ ఆహ్వానిస్తుందని, ఇది ప్రజాస్వామ్యానికి శుభపరిణామం అని ఎన్నో ఏళ్లుగా బీసీల రాజ్యాంగ అధికారం కోసం జరుగుతున్న పోరాటాన్ని గౌరవించినట్లేనని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొ. సింహాద్రి అన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ కుల సర్వేల చర్చలో భాగంగా విద్యా, ఉద్యోగ అవకాశాలలో 42 శాతం ప్రాతినిధ్యం కల్పించడానికి మరో బిల్లును తీసుకువస్తున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సమాజ్‌వాది పార్టీ అభినందిస్తుందన్నారు. కులగణన సర్వే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని అందరి భాగస్వామ్యంతో రాజకీయ, ఆర్థిక వ్యవస్థను మలిచినప్పుడు మాత్రమే రాష్ట్రం, దేశం అభివృద్ధి దిశలో ముందంజలో ఉంటుందన్నారు.



ఉచిత బ్యూటీషియన్ కోర్సు శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న కరుణ, పావని

బ్యూటీషియన్ కోర్సు శిక్షణా శిబిరం ప్రారంభం

చిక్కడపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ వారి ఆధ్వర్యంలో నీవి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం గాంధీనగర్ డివిజన్ మహిళలకు ఉచిత బ్యూటీషియన్ కోర్సు శిక్షణాశిబిరాన్ని డివిజన్‌లోని వీవీగిరినగర్ కమ్యూనిటీ హాల్‌లో లయన్స్‌క్లబ్ లేడీ గవర్నర్ కరుణ, డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ ప్రారంభించారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మనోహర్‌రెడ్డి ఉచిత శిక్షణా కేంద్రానికి స్వచ్ఛందంగా పరికరాలను సమకూర్చిన లయన్ శ్రీనివాస్ కల్లూరి, రజనీ ముఖ్య గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరుణ, పావని మాట్లాడుతూ ఉచిత బ్యూటీషియన్ కోర్సు శిక్షణాశిబిరాన్ని ప్రపంచ మహిళా దినోత్సవం రోజున ప్రారంభించడం చాలా సంతోషం అన్నారు. డివిజన్ మహిళలు ఈ కోర్సులో శిక్షణ పొంది స్వయం ఉపాధి పథకాలు సద్వినియోగం చేసుకుని వ్యాపారం చేసి వృద్ధిలోకి రావాలన్నారు. బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సరిపల్లి గణేష్, పద్మశాలి సంఘం నేత సారిక, చంద్రమోహన్, ప్రాజెక్ట్ చైర్ పర్సన్ లక్ష్మీప్రతిమ, జోన్‌చైర్‌పర్సన్ మరాన్ సుబ్రహ్మణ్యం, డివిజన్ మహిళలు పాల్గొన్నారు.

కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలి

● సీఐటీయూ ఉపాధ్యక్షుడు వీరయ్య

రాంనగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరిస్తూ కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా తీసుకువచ్చిన నూతన లేబర్ కోడ్‌లను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. మెడికల్ అండ్ సేల్స్ ఉద్యోగులకు కనీస వేతనాలపై నోటిఫికేషన్ జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న ఢిల్లీలో జరగనున్న కార్మిక సంఘాల సదస్సులో కార్యాచరణ ప్రకటిస్తున్నామన్నారు. మేలో జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



అడిక్‌మెట్‌లో పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్



బీసీ భవన్‌లో రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, మహిళా నేతలు రమాదేవి, లక్ష్మి, లత, మంజువాణి, విజయలక్ష్మి



బాగ్‌అంబర్‌పేటలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత తదితరులు



భాస్కర ఆడిటోరియంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న సినీ నటుడు సుమన్, దివ్యవాణి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆర్.శేషసాయి తదితరులు

వనితా వందనం

వాడవాడల్లో ఘనంగా మహిళాదినోత్సవం

● ఉత్సాహంగా పాల్గొన్న యువతులు, మహిళలు ● సన్మానించిన కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ముషీరాబాద్, భోలక్‌పూర్, బర్కత్‌పుర, నల్లకుంట, అంబర్‌పేట గోల్నాక, రాంనగర్, చిక్కడపల్లి, కవాడిగూడ ప్రాంతాల్లో కేక్‌లు కట్‌చేసి వేడుకలు నిర్వహించి మహిళలను సన్మానించారు. ఈ వేడుకల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం హాల్‌లో మహిళలను సన్మానించిన కె.ఎం శంకర్ తదితరులు



భోలక్‌పూర్ యూపీహెచ్‌సీలో ఆస్పత్రి సిబ్బందిని సన్మానించి కేక్‌కట్‌చేసిన తేజా గౌడ్



పద్మశాలికాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న సొసైటీ మహిళా కమిటీ అధ్యక్షురాలు సుజాత



ముషీరాబాద్ కేర్ ఆస్పత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో మాట్లాడుతున్న ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సూర్యప్రకాష్



అంబర్‌పేట న్యూపటేల్‌నగర్‌లో పారిశుధ్య కార్మికులకు శాలువలతో సత్కరిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్



టీడీపీ ఆధ్వర్యంలో వేడుకలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నర్సింహులు, సాయిబాబా, సామ భూపాల్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు



అఖిల గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవంలో బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి, సినీ నటుడు బాలాజీ, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాంచందర్‌రావు, లక్ష్మణ్ తదితరులు



బాగ్‌లింగంపల్లి వద్ద ఏఐఎఫ్‌డిడబ్ల్యు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ



అంబర్‌పేట ఈస్ట్‌జోన్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీవాణి, పోలీసు సిబ్బందికి సన్మానం



కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవిని సత్కరిస్తున్న మహిళామోర్చా నేతలు లావణ్య, సారిక, తార



విద్యానగర్‌లో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహ తదితరులు



ఆర్టీసీ ముషీరాబాద్ డిపోలో జరిగిన మహిళా దినోత్సవంలో పాల్గొన్న అధికారులు డాక్టర్ రోహిణి, డిపో మేనేజర్ కిషన్‌రావు, కల్యాణి, జ్యోతిక తదితరులు

విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత స్థాయికి ఎదగాలి

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



విజేతలైన చిన్నారులకు మెడల్స్ ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

కవాడిగూడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదవి ఉన్నత స్థాయికి ఎదగాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని పేద విద్యార్థులు అధైర్యపడకుండా విద్యపై ప్రత్యేక దృష్టి సారించి సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగి కని పెంచిన తల్లిదండ్రులకు, చదివిన పాఠశాలకు విద్యనేర్పిన ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆయన కోరారు. శనివారం కవాడిగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీలు హాజరై పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, నగర నాయకులు మహేందర్‌బాబు, డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ గంగపుత్ర. బీజేపీ నేతలు బొల్ల రమేష్, మద్దెల చంద్రయ్యగౌడ్, రాగంరవికుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, బీఆర్ఎస్ నేతలు శ్రీహరి, మహిళా నేతలు మాదవి, మంజుల, స్వరూప, ప్రకాష్ ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ పావని, మేడే దేవదాస్, ఉపాధ్యాయులు. విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాహనం ఢీకొని నేలకూలిన వేపచెట్టు

● సంఘటనా స్థలంలో ఎవరూ లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం

కవాడిగూడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం ఓ భారీ స్క్రాబ్ లోడ్‌తో వస్తున్న వాహనం సమీపంలో ఉన్న వేపచెట్టును ఢీకొట్టడంతో నేలకూలింది. సంఘటనా స్థలంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది, గాంధీనగర్ బ్రిడ్జి మీదుగా ఎల్ఐసీ కార్యాలయ సమీపంలో నుంచి బోలక్‌పూర్‌కు భారీ స్క్రాబ్ వాహనాలు వెళుతుంటాయి. ఈ క్రమంలో సాయంత్రం 4 గంటల సమయంలో ఓ భారీ స్క్రాబ్ వాహనం బోలక్‌పూర్ మీదుగా ఎల్ఐసీ కార్యాలయం వైపు వెళుతుండగా సమీపంలో ఉన్న వేపచెట్టును ఢీ కొట్టడంతో వేపచెట్టు నేలకూలిపోయింది. రోడ్డుకు అడ్డంగా వేపచెట్టు నేలకూలడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. స్థానికులు పోలీసులకు, డీఆర్ఎఫ్ టీంకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా నేలకూలిన చెట్టును డీఆర్ఎఫ్ సిబ్బంది కట్ చేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.







మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాల్, ఫిష్ విక్రయ స్టాల్, వస్త్ర కుట్టు శిక్షణ స్టాల్

ఇందిరా మహిళా శక్తి సభలో ఆకట్టుకున్న స్టాల్స్

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు

హైదరాబాద్ సిటీ/ మారేడ్‌పల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సభలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళా సంఘాల సభ్యులు తమ ఉత్పత్తులు ప్రదర్శించారు.

ఇందిరా మహిళా శక్తి బస్సులు ప్రారంభం



సభకు తరలివచ్చిన మహిళలు

పరేడ్ గ్రౌండ్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో టీజీఎస్ఆర్టీసీకి చెందిన 20 ఇందిరా మహిళా శక్తి బస్సులను సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో కలిసి ప్రారంభించారు. సాయంత్రం 4 తర్వాత మహిళలు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

64 లక్షల మందికి ఉపాధి

రాష్ట్రంలో సెర్ప్-మెప్మాతో మహిళా సంఘాల ద్వారా 64 లక్షల మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. మహిళా సంఘాలు గ్రూపులుగా ఏర్పడి తయారు చేస్తున్న అన్ని రకాల ఉత్పత్తులకు మార్కెట్లో మంచి ఆదరణ లభిస్తోంది.

\- ఎంపీ కృష్ణ, సెర్ప్ డైరెక్టర్

32 జిల్లాల్లో 64 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లు

తెలంగాణ ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళా సంఘాలకు 1000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ కేటాయించాలని నిర్ణయించింది. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం 32 జిల్లాల్లో మహిళా సంఘాలకు 2 మెగావాట్ల చొప్పున 64 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుతో మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం.

\- వావిల్లా అనిలా, టీజీఎస్ రెడ్కో ఎండీ



తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సంఘం అధ్యక్షుడు డాక్టర్ తిప్పర్తి యాదయ్య తదితరులు

తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం డైరీ ఆవిష్కరణ

రాంనగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షుడు డాక్టర్ తిప్పర్తి యాదయ్య ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చినట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ తిప్పర్తి యాదయ్య తెలిపారు. ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారని ఆయన తెలిపారు. పదవి విరమణ చేసిన వారికి బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్యామ్, డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధి ప్రసాద్‌యాదవ్, నాయకులు జగన్‌మోహన్, రవి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కృషి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద 25 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.8 లక్షల 49 వేల ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అర్హులైన వారందరికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందే విధంగా తన పూర్తి సహాయసహకారాలు ఉంటాయన్నారు. కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక వ్యక్తిని పెట్టి సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం కోసం వచ్చే వారికి సముచితమై సేవలందించడం జరుగుతుందన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయంతో పేద, మధ్యతరగతి ప్రజలు మెరుగైన వైద్యసేవలు పొందుతున్నారన్న ఆత్మవిశ్వాసం వారిలో ఉందన్నారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గం ప్రజల సేవకు, అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్నానని అన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1 పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. జెఎన్, జెఎం 11కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి 11, పీఎస్‌సీ, సి.ఓ పరిధిలో 11 నుంచి 12, కార్పొరేట్ ఆఫీస్ పరిధిలో సాయంత్రం 3నుంచి 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

సరస్వతి దేవాలయంలో హుండీ లెక్కింపు

నల్లకుంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ న్యూనల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి దేవాలయంలో హుండీని లెక్కించారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఆలయ ఈవో కె.జయంతి పర్యవేక్షించారు. హుండీల్లో లెక్కించిన మొత్తం రూ.7,49,370 నగదు దేవాలయానికి సంబంధించి బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు ఈవో తెలిపారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362